సాక్షి
మంచిర్యాల
శనివారం । 23 । మార్చి । 2024



విద్యార్థిని ఆత్మహత్యపై ఆందోళన

డిప్లొమా ద్వితీయ సంవత్సరం విద్యార్థిని భీముని వైష్ణవి ఆత్మహత్యకు కారకులపై చర్య తీసుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థినులు ఆందోళనకు దిగారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:29	ఆది : 4:54

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0 /23.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యేలు



సీఎంను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, వంశీక్రిష్ణ

బెల్లంపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పెద్దపల్లి లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీక్రిష్ణ, బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ అభ్యర్థిగా వంశీక్రిష్ణను ప్రకటించిన నేపథ్యంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ అధిష్టానం వంశీకృష్ణ పేరును ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. పెద్దపల్లి ఎన్నికల బరిలో వంశీకృష్ణను గెలిపించడానికి తీవ్రంగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావులను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

బడి నిర్వహణ నిధులు విడుదల

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల నిర్వహణకు సంబంధించిన రెండో విడత నిధులు విడుదలయ్యాయి. 2023–24 విద్యాసంవత్సరానికి 50శాతం నిధులు విడుదలైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. జూలైలో 720 స్కూళ్లకు సగం నిధులు రూ.75.85లక్షలు మంజూరయ్యాయని, ఆటపరికరాల కొనుగోలుకు స్పోర్ట్స్ నిధులు రూ.22.80లక్షలు, ఎమ్మార్సీ నిధులు రూ.10.36 లక్షలు, 51స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.14.28 లక్షలు విడుదలయ్యాయని పేర్కొన్నారు. జూలైలో 50శాతం నిధులు విడుదల కాగా రెండో విడతలో మిగతా 50శాతం నిధుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితిపై ఈ నెల 22న 'సాక్షి'లో 'బడి నిర్వహణ నిధులేవి' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నెల 31లోపు పూర్తిగా నిధులు వినియోగించకుంటే వెనక్కి వెళ్లే అవకాశాలు ఉన్నాయి.

ఆర్టీసీ ఆస్పత్రికి వైద్యుడొచ్చాడు

మంచిర్యాలఅర్బన్: నెలన్నర రోజులుగా ఖాళీగా ఉన్న మంచిర్యాల ఆర్టీసీ ఆస్పత్రిలో వైద్యుడు రత్నకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన పరంజ్యోతి అనారోగ్యంతో వెళ్లిపోయారు. ఫిబ్రవరి 27న 'సాక్షి'లో 'వైద్యుడు రాడు.. మందులు లేవు' శీర్షికన కథనం ప్రచురితమైంది. రోజులు గడుస్తున్నా వైద్యుడు లేకపోవడంతో సేవలు నిలిచిపోవడం, నెలకు సరిపడా అత్యవసర మందులు లేకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. వందలాది మంది ఉద్యోగులతోపాటు నిత్యం విశ్రాంత ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వచ్చి వెనుదిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వ్యయప్రయాసాలు పడి వచ్చిన కార్మికులు వైద్యుడు లేరనే సమాధానంతో నిరాశకు గురయ్యారు. కార్మికుల ఇబ్బందుల నేపథ్యంలో వారంలో ఒకరు రోజు కరీంనగర్ నుంచి వైద్యుడు వచ్చి వెళ్లారు. ప్రస్తుతం పూర్తి స్థాయి కాంట్రాక్టు పద్ధతిన వైద్యుడు రత్నకుమార్ విధుల్లో చేరారు.

27న రోడ్డు ప్రమాదాల నివారణపై సమావేశం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కన్నాల శివారు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఈ నెల 27న ఉదయం 11గంటలకు బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీవో పి.హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి 363లోని కన్నాల గ్రామ పంచాయతీ వద్ద ఎన్‌హెచ్ఏఐ అధికారులు దారి మళ్లింపు(యూ టర్న్) చేయడంతో ఏడుగురు మరణాలకు కారణమైందని తెలిపారు. జాతీయ రహదారి భద్రత చట్టాన్ని అనుసరించి ప్రమాదాల నివారణపై చర్చించడానికి ఎన్‌హెచ్ఏఐ, ఎక్సైజ్, రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమావేశానికి హాజరై సూచనలు చేయాలని కోరారు.

తాగునీటి కోసం ధర్నా



చెన్నూర్: మండలంలోని బావురావుపేట శివారులో గుడిసె వాసులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు మద్దెల భవాని మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి గుడిసెల్లో బోర్లు వేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట నాయకురాలు ప్రసన్న, రుక్మిణి, సుజాత, ప్రియాంక, మౌలిక, పద్మ, శిరీష పాల్గొన్నారు.

సమరానికి సై!



- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లో ఎన్నికల వేడి
- ఎంపీ అభ్యర్థులు తేలడంతో పోటాపోటీ
- ప్రజాక్షేత్రంలో ఢీకొట్టేందుకు అభ్యర్థులు రెడీ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి స్థానం నుంచి పోటీపడే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ఎన్నికల వేడి ఒక్కసారిగా పెరిగింది. ఎన్నికల్లో తలపడే ప్రత్యర్థులు ఎవరనేది తేలడంతో అధికార, విపక్ష పార్టీలు ఇక ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నాయి. పార్టీలో తమ కేడర్‌ను సిద్ధం చేస్తూ ప్రజామద్దతు కోరే పనిలో నిమగ్నమయ్యాయి. ఇప్పటికే పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ అభ్యర్థులు పట్టు పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి తీరేందుకు వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు.

కాంగ్రెస్‌లో జోష్..

గత అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసింది. దీంతో తమకే మద్దతు ఉందనే ధీమాతో పార్టీ నాయకులు ఉన్నారు. దీనికితోడు ఆర్థిక, రాజకీయంగా బలంగా ఉన్న గడ్డం వంశీక్రిష్ణను బరిలోకి దించడంతో కచ్చితంగా గెలుస్తామనే నమ్మకంతో ఉన్నారు. మరోవైపు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ కావడంతోపాటు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు సైతం 'హస్తం' పార్టీకి చెందిన వారే అధికంగా ఉన్నారు. దీంతో కేడర్‌లో ఉత్సాహం, ప్రజల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు పెరిగిన నేపథ్యంలో విజయం తథ్యమనే భావిస్తున్నారు. వంశీకి టికెట్ ఇవ్వడంపై సొంత పార్టీలోనే కొందరు నాయకుల్లో ఇంకా అసంతృప్తి మిగిలి ఉంది. ఒకే కుటుంబానికి రాజకీయ అవకాశాలు ఇస్తున్నారనే వాదనలు ఉన్నాయి. వీరంతా అసంతృప్తిని వీడి పార్టీ ప్రకటించిన అభ్యర్థికి మద్దతు తెలిపి గెలుపు కోసం పని చేయాల్సి ఉంది. ఈ క్రమంలో గ్రూపు విభేదాలు వంశీ గెలుపుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

'కమలం' గెలుపుపై ఆశలు

కేంద్రంలోని ప్రధాని మోదీ చరిష్మా, బీజేపీ విధానాలు, హిందుత్వ ఎజెండాతో కమలం పార్టీ గెలుపుపై ఆశలు పెట్టుకుంది. రాష్ట్రంలో బీజేపీ నాయకుల రాక, బహిరంగ సభలతో అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంటు ఎన్నికల్లో తమకు మద్దతు పెరుగుతుందనే ధీమాలో ఉన్నారు. టికెట్ కోసం ఆశావహులు అనేకమంది పోటీలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకుడైన గోమాసే శ్రీనివాస్‌కు పార్టీలో చేరిన వెంటనే టికెట్ ఖరారు చేసింది. 'గోమాసే' సైతం ఆర్థికంగా స్థితిమంతుడు కావడంతోపాటు నేతకాని సామాజికవర్గ ఓట్లు, గతంలో పోటీ చేసిన అనుభవం తమకు పనికి వస్తుందని నమ్ముతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గం మినహా ఎక్కడా ఆశించిన ఓట్లు రాలేదు. కేంద్రంలో ఏర్పాటు చేసే సర్కారుకు ఇక్కడి ప్రజల మద్దతు ఉంటుందనే ఆలోచనలు చేస్తున్నారు. ఇందుకోసం పట్టణ ఓటర్లు, యువత, హిందూ ఓటు బ్యాంకుపై ప్రధానంగా ఆధారపడుతూ వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు.

పోరాడుతున్న 'బీఆర్ఎస్'

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత 'గులాబీ' పార్టీ బలహీనపడింది. రోజుకోచోట నాయకులు పార్టీ మారుతున్నారు. పార్టీ జిల్లా నాయకత్వం సైతం ఏం చేయలేక చేతులెత్తేయడంతో ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఈ క్రమంలో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన గెలుపు కోసం చెమటోడుస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. సామ్యుడు, కార్మిక, ఉద్యమ నేపథ్యం, ఓడిపోయిన సానుభూతి, రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగితే తమకు కలిసివస్తుందని అనుకుంటున్నారు. తాజా, మాజీ ప్రజాప్రతినిధులు పార్టీని వీడడం, ప్రజల్లో ఇంకా బీఆర్ఎస్‌పై వ్యతిరేకత కనిపించడం వంటివి 'గులాబీ' పార్టీ అభ్యర్థి గెలుపునకు అవరోధాలుగా ఉన్నాయి.

తరిగిపోతున్న గూడెం గుట్టలు



తవ్వకాలతో ఆకారం కోల్పోతున్న గుట్టలు

- అనుమతులు గోరంత.. కొండంత తవ్వకాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయం గుట్టను ఆనుకుని ఉన్న గుట్టలు తరిగిపోతున్నాయి. కొంతమేరకు క్వారీ తవ్వకాలకు అనుమతి ఉండగా గుట్టంతా తవ్వకాలు సాగుతున్నాయి. అధికారులు మామూలుగా వ్యవహరిస్తుండడంతో గుట్టలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. స్థానికంగా ఉండే కొందరు బేస్‌మెంట్ రాళ్ల, 40 ఎంఎం కంకర తయారీ కోసం గుట్టల్లో జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించి బండలను బ్లాస్టింగ్ చేస్తున్నారు. గుట్టలకు కంప్రెషర్లతో రంధ్రాలు చేసి జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చి పెద్ద పెద్ద రాళ్లను చిన్నగా చేస్తున్నారు. వాటిని కూలీలతో బేస్‌మెంటు రాళ్లుగా మలిచి ఇళ్ల, ప్రహరీల నిర్మాణాలు, పునాది కట్టడాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా గుట్టల్లో నిత్యం బ్లాస్టింగ్ పేలుళ్ల, శబ్దాలు హోరెత్తుతున్నాయి. సమీప పంట పొలాల రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ప్రమాదాల అంచునా..

క్వారీ తవ్వకాలు, బ్లాస్టింగ్ వంటి పనులను పలువురు కూలీలు ప్రమాదాల అంచున చేపడుతున్నారు. ఎత్తయిన కొండలను మొదటి వరకు తాళ్ల సాయంతో చేరుకుని అక్కడ బ్లాస్టింగ్ చేసిన బండలను కిందకు తోసేయడం, ఆ తరువాత వాటిని బేస్‌మెంట్ రాళ్లుగా, చిన్న చిన్న రాళ్లను 40 ఎంఎం కంకరగా తయారు చేసి ట్రాక్టర్ల ద్వారా తరలించి విక్రయిస్తున్నారు. గతంలో ఇక్కడ ఓ క్రషర్ ఉండేది. అందుకు అవసరమయ్యే బండను తవ్వేందుకు అనుతులు తీసుకున్నారు. ప్రస్తుతం ఆ క్రషర్‌ను తొలగించినా క్వారీ తవ్వకాలు సాగుతున్నాయి.

గుట్టుగా దందా..

గుట్టల్లో క్వారీ, మొరం తవ్వకాల దందా గుట్టుగా సాగుతోంది. గూడెం గ్రామ శివారులోని గుట్టలన్నీ తరిగిపోయి నేలమట్టం అవుతున్నాయి. ప్రకృతి సంపదను కొందరు అక్రమార్కులు కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యారాణిని సంప్రదించగా.. తాను బదిలీపై ఇక్కడి వచ్చినప్పటి నుంచి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, గతంలో తీసుకుని ఉన్నారేమో తెలియదని, రికార్డులు చూస్తే తెలుస్తుందని చెప్పారు.

'గిరి' భూముల్లో అక్రమ వెంచర్లు

- కాలువలు కబ్జా చేస్తున్న రియల్ వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో గిరిజన చట్టం 1/70 అమల్లో ఉన్నా రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. అమాయక గిరిజనుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చట్టానికి విరుద్ధంగా బాండు పేపర్ ద్వారా కొనుగోలు చేసి వెంచర్లు చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కన, పట్టణానికి సమీపంలో భూములు ఉండడంతో కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. గిరిజన చట్టం ప్రకారం గిరిజనులకు మాత్రమే నిర్మాణాలకు హక్కు ఉంటుంది. గిరిజనేతరులు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. కానీ గిరిజనేతరులు నిర్మాణాలు చేపట్టి విద్యుత్, నల్లా, రోడ్డు, విద్యుత్ దీపాలు తదితర మౌలిక సదుపాయాలు పొందుతున్నారు. సౌకర్యాలు ఎలా కల్పిస్తున్నారని సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే.. 298 జీవో ప్రకారం నిర్మాణాలకు సౌకర్యాలు కల్పిస్తే ప్రభుత్వానికి పన్ను రూపంలో ఆదాయం వస్తుందని సమాధానం చెబుతున్నారు.

అక్రమణలు

అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేయడమే కాకుండా వెంచర్ పక్కనే ఏదైనా ప్రభుత్వ భూమి, కాలువలు ఉన్నా సరే చదును చేసి ప్లాట్లుగా మలిచి విక్రయిస్తుంటారు. జాతీయ రహదారి పక్కన సుమారు మూడు వందల మీటర్ల దూరంలో కొత్త వెంచర్‌లో ఊరుమందమర్రి చెరువు నుంచి అందుగులపేట రాళ్ల వరకు ప్రవహించే కాలువను చదును చేసి వెంచర్ చేశారు. గతంలో ప్రభుత్వం ఆ కాలువ నీటి ప్రవాహం కోసం పలు చోట్ల వాల్స్ కూడా నిర్మించిన ఆనవాళ్లు ఉన్నాయి.



కాలువను కబ్జా చేసి చదును చేసిన దృశ్యం

కొనుగోలుదారుల ఇబ్బందులు

గతంలో గిరిజనుల భూములు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టిన పలువురు ఇబ్బందులు పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. భూమి కొనుగోలు చేసి ఇల్లు నిర్మించిన తర్వాత భూమి తమదే అంటూ కొన్నేళ్ల క్రితం భూమి విక్రయించిన వారి వారసులు కోర్టుకెళ్లగా గిరిజనుల భూమి క్రయవిక్రయాలు చేయరాదనే నిబంధన ప్రకారం ఆ భూమి గిరిజనులకే చెల్లుతుందని కోర్టు తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు పోలీసులు కూలగొట్టారు. కొందరు గిరిజనులు ఒకే భూమిని ఇద్దరు, ముగ్గురికి అమ్మజూపడంతో వెంచర్ ఏర్పాటు సమయంలో రియల్ వ్యాపారులు తగాదాలకు దిగడం పోలీస్‌స్టేషన్, కోర్టుకెళ్లడం జరుగుతోంది.

నిర్మాణాలకు అనుమతి లేదు..



1/70 ఆక్ట్ ప్రకారం గిరిజనులు భూములు గిరిజనేతరులు కొనడం నేరం. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో గిరిజనేతరులు వారి పేరిట భూమి ఉంటేనే నిర్మాణాలు చేపట్టాలి. గిరిజనుల భూములు కొనుగోలు చేసి ఇబ్బందుల్లో పడొద్దు. మున్సిపాలిటీ పరిధిలో వెంచర్లకు అనుమతులు లేవు. పట్టా భూమి కొనుగోలు చేసుకుని అన్ని అనుమతులు వచ్చాకే ఇంటి నిర్మాణం చేపడితే భవిష్యత్‌లో ఇబ్బంది ఉండదు. అక్రమ వెంచర్ల ఏర్పాటు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– ఎస్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ మందమర్రి

15వరకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలి

చెన్నూర్‌రూరల్: వచ్చే నెల 15వరకు సోలార్ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణరావు సూచించారు. మండలంలోని శివలింగాపూర్ సమీపంలో మూతపడ్డ 2ఇంక్‌లైన్ గని ఆవరణలో నిర్మిస్తున్న 11 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ పనులను శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితోపాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో పాలు పంచుకోవడం అభినందించదగిన విషయం అన్నారు. రక్షణతో కూడిన నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. సోలార్ జనరల్ మేనేజర్ జానకిరాం, ఎస్‌వో టు డెరెక్టర్ కేవీ.రావు, సోలార్ డీజీఎంలు శ్రీనివాస్, పి.అప్పారావు, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం రవీందర్ పాల్గొన్నారు.



ప్లాంటు పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్, జీఎం

గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మించాలి

- ముల్కల్ల వద్ద నిర్మిస్తే ప్రజాధనం వృథా
- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల, అంతర్గాం మధ్య గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి అప్పటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి మంజూరు చేయించామని, ప్రస్తుతం వేసవి కావడంతో నదిలో నీరు తగ్గి నిర్మాణానికి అనుకూలంగా ఉందని, వెంటనే బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో ఎన్నడూ లేనంతంగా నీరు తగ్గిందని, బ్రిడ్జి నిర్మాణంతో మంచిర్యాల నుంచి పెద్దపల్లి వరకు 19కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. రూ.164 కోట్లు మంజూరయ్యాయని, ప్రస్తుత ఎమ్మెల్యే ఈ బ్రిడ్జిని రద్దు చేసి ముల్కల్ల వద్ద నిర్మించాలని చూస్తున్నారని, దీని వల్ల ప్రభుత్వంపై రూ.440 కోట్లు భారం పడుతుందని తెలిపారు. ప్రజలకు సమయ దూరాన్ని, ప్రజాధనాన్ని వృథా చేసే పనులు చేయవద్దని హితవు పలికారు. గతంలో ధాన్యం కొనుగోలులో తాలు పేరిట కోత విధించారని, అక్రమాలను కక్కిస్తానని లేనిపోని ఆరోపణలు చేశారని, అలాంటి అక్రమాలు తన రాజకీయ చరిత్రలో చేయలేదని అన్నారు. నిందలు వేయడం మానేసి మెట్‌పల్లి, నాయికినిపేటలో రైతుల వద్ద తీసుకున్న రూ.60 లక్షలు వారికి తిరిగి ఇవ్వాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, బీఆర్ఎస్ నాయకులు సుంకరి రమేశ్, శ్రీపతి శ్రీనివాస్, తాజ్, మొగిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

'మాతాశిశు'లోనూ ఆ'పరేషాన్'..!

- మంచిర్యాల, కుమురంభీం జిల్లాల నుంచే ఎక్కువ గర్భిణులు
- సాధారణం కంటే సిజేరియన్ ప్రసవాలే ఎక్కువ



మంచిర్యాలలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలోని ప్రసవాల వార్డు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రయత్నిస్తుండగా.. ప్రైవేటు ఆస్పత్రులు కేవలం సిజేరియన్ ప్రసవాలకే మొగ్గు చూపుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధిక సంఖ్యలో ప్రసవాలు జరిగే మంచిర్యాలలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలోనూ సాధారణ ప్రసవాల కంటే సిజేరియన్లు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేందుకు ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రీషన్ ఫుడ్‌తోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తోంది. ప్రతీ నెల ఆశా కార్యకర్తల సహాయంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు, స్కానింగ్ చేయిస్తున్నారు. అయినా సాధారణ ప్రసవాల సంఖ్య పెరగకపోవడం, సిజేరియన్లు ఎక్కువగా నమోదు అవుతుండడం గమనార్హం. అన్ని ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నా సిజేరియన్లు ఆగడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బుల కోసం సిజేరియన్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సిజేరియన్ల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

అత్యవసర కేసులు ఇక్కడికే..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ కృషి చేస్తున్నా భారం మొత్తం మాతాశిశు ఆరోగ్య కేంద్రంపైనే పడుతోంది. బెల్లంపల్లి, లక్సెట్టిపేట, చెన్నూరులో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు ఉండగా, అన్ని మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. అన్నింటిలోనూ ప్రసవాల నిర్వహణకు సౌకర్యాలు ఉన్నాయి. సాధారణ ప్రసవాలు మాత్రమే ఆయా ఆసుపత్రుల్లో నిర్వహిస్తూ కాస్త ఇబ్బందిగా అనిపించినా వెంటనే మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి పంపిస్తున్నారు. ఇక్కడి వైద్యులు గర్భిణీ పరిస్థితిని బట్టి సాధారణ ప్రసవాలు కొన్ని చేస్తుండగా, ఎక్కువగా సిజేరియన్‌లు నమోదవుతున్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సిజేరియన్లను చేసేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో సాధారణ ప్రసవాలు అక్కడే చేసి సిజేరియన్ కేసులు మంచిర్యాల ఎంసీహెచ్‌కు పంపిస్తుండడంతో ఆపరేషన్ల సంఖ్య ఎక్కువగా నమోదవుతోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొందరు నర్సులను ఎంపిక చేసి గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేసేలా వివిధ రకాల వ్యాయామాలు చేయించేందుకు శిక్షణ ఇచ్చి, మిడ్‌వేవ్స్ కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా సాధారణ ప్రసవాల సంఖ్య పెరగకపోవడంతో వైద్య, ఆరోగ్య శాఖ మరింత దృష్టిని సారిస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరి ఎంసీహెచ్‌లోనూ సాధారణ ప్రసవాలు పెరిగేందుకు అవకాశం ఉంటుంది. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు వైద్యుల్లో ఒకరు ప్రొఫెసర్, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఇద్దరు కాంట్రాక్టు గైనకాలజిస్టులు ఉండగా, ఆయా వైద్యుల సేవలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే సాధారణ ప్రసవాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంది. సీజేరియన్లు తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఎంసీహెచ్‌లో జరిగిన ప్రసవాలు

నెల	సాధారణ	సిజేరియన్లు	మొత్తం
2023			
ఫిబ్రవరి	111	151	262
మార్చి	99	218	317
ఏప్రిల్	111	176	287
మే	93	195	288
జూన్	124	195	319
జూలై	145	237	382
ఆగస్టు	148	233	381
సెప్టెంబర్	132	265	397
అక్టోబర్	141	301	442
నవంబర్	162	311	473
డిసెంబర్	158	298	456
2024			
జనవరి	125	251	376
ఫిబ్రవరి	115	201	316
మొత్తం	1,664	3,032	4,696

తప్పనిసరి పరిస్థితుల్లోనే సిజేరియన్లు



మంచిర్యాల మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలతోపాటు అత్యవసరం అయితేనే తప్పనిసరి పరిస్థితుల్లో సిజేరియన్లు చేయాల్సి వస్తోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాతోపాటు మంచిర్యాల జిల్లాలోని వివిధ ఆసుపత్రుల నుంచి గర్భిణుల పరిస్థితి క్రిటికల్‌గా ఉన్న వారిని ఎంసీహెచ్‌కు పంపిస్తున్నారు. వారికి సాధారణ ప్రసవం చేసేందుకు వైద్యులు కృషి చేసి కొందరికి సాధారణ ప్రసవం చేస్తుండగా, పరిస్థితిని బట్టి సిజేరియన్లు చేయాల్సి వస్తోంది.

– డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఫిర్యాదు



ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలోని పలు మద్యం దుకాణాల యజమానులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని శుక్రవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ సామ్యూల్‌జాన్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. చింతలమానెపల్లి మండలం గూడెం మద్యం దుకాణం యజమాని మద్యాన్ని అధిక ధరకు అమ్ముతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్ముల మల్లయ్య, నాయకులు సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, గ్రామస్తులు శంకర్, దేవాజీ, సంజీవ్, పురుషోత్తం, మనోజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం



చెడ్వాయి శివారులో బెల్లం పానకాన్ని పారబోస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్/పెంచికల్‌పేట్: కాగజ్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని చెడ్వాయి, గన్నారం గ్రామాల్లో నాటుసారా తయారు చేసి అమ్ముతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ అధికారులు, డీటీఎఫ్ ఆసిఫాబాద్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ సామ్యూల్ జాన్ తెలిపారు. చెడ్వాయి గ్రామశివారులోని పెద్దవాగు సమీపంలో 2వేల లీటర్ల బెల్లం పానకాన్ని పారబోసినట్లు వివరించారు. ఎక్సైజ్ ఎస్సై సురేశ్, డీటీఎఫ్ ఎస్సై రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

జైనూర్: మండల కేంద్రానికి చెందిన దేవిదాస్ ఇంట్లో గుడుంబా నిల్వ చేశాడనే ముందస్తు సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇంట్లో నిల్వ చేసిన నాలుగు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

జీవో 94ను రద్దు చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): జీవో 94ను రద్దు చేసి జీవో 22 ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. జీవో 94ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీ, నర్సరీల్లో కాంట్రాక్టు కార్మికుల సంతకాల సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఐదేళ్లకోసారి సవరించాల్సిన కార్మికుల కనీస వేతనాల జీవోను 2012 నుంచి సవరించకపోవటంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జీవో 22 ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనంగా రూ.18,019 నిర్ణయించగా, కొత్త జీవో ప్రకారం కార్మికుల కనీస వేతనాన్ని రూ.11,325గా నిర్ణయించి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందన్నారు. జీవో 94ను రద్దు చేయాలని చేపట్టిన సంతకాల సేకరణ కాపీలను ఈనెల 28న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు. కార్మికులు బాలేస్, జబ్బార్, వెంకటేశ్, కొమురయ్య, పర్వతాలు, చారి, జగదీశ్, శారద, చిన్నుబాయి, అనిత, లక్ష్మి పాల్గొన్నారు.

తిరస్కరిస్తే పరిష్కారమైనట్లా?

- ఆందోళనకు గురి చేస్తున్న ధరణి
- మాడ్యూల్స్ సవరణకు అవకాశం
- అయినా దరఖాస్తులు పెండింగ్
- సమస్యలు పరిష్కరించేదెప్పుడో..!



తాండూర్ తహసీల్దార్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ సెక్షన్

తాండూర్: ఏళ్లు గడుస్తున్నా రైతుల భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. భూప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణిని అందుబాటులోకి తీసుకురాగా స్వల్ప కారణాలతో అనేకమంది రైతుల భూసమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అపరిష్కృతంగా ఉన్న భూముల చిక్కుముడులు విప్పేందుకు ధరణి మాడ్యూల్స్‌లో సవరణలు చేసినా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా ఉండిపోయాయి. బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో తిరస్కరణకు గురైన భూదస్త్రాలు కూడా పరిష్కారమైనట్లు ధరణి వెబ్‌సైట్‌లో చూపిస్తుండడంతో మార్పే మీ లేకుండా పోయింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ధరణి మాడ్యూల్స్‌లో మార్పులు తీసుకువచ్చినా భూ సమస్యలు తీరకపోవడం రైతులకు శాపంగా మారింది.

ఆన్‌లైన్‌లో 2,107 దరఖాస్తులు

రెవెన్యూ డివిజన్ పరిధిలో బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, కన్నెపల్లి, భీమిని, నెన్నెల, వేమనపల్లి మండలాలున్నాయి. వీటి పరిధిలో భూసమస్యల పరిష్కారానికి రైతులు ఆన్‌లైన్‌లో 2,107 దరఖాస్తులు అందించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సత్వరంగా దరఖాస్తులను పరిశీలించి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఈ నెల 16వ తేదీ వరకు 1,340 దరఖాస్తులను పరిశీలించారు. ఇందులో 1,331 దరఖాస్తులను పరిష్కరించడానికి అవకాశాలున్నట్లు నిర్ధారణకు వచ్చారు. వీటిలో ఆర్డీవో పరిధిలో 82 దరఖాస్తులే పరిష్కారం కాగా, మిగతా దరఖాస్తులు తహసీల్దార్, కలెక్టర్ పరిధిలో అపరిష్కృతంగా ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా తహసీల్దార్ల స్థాయిలో 307 దరఖాస్తులు పరిష్కరించినట్లు చెబుతున్నారు. వీటిలో 95 శాతం మందివి తిరస్కరించినట్లుగా ఆన్‌లైన్‌లో చూపుతున్నారు. అయితే తిరస్కరణకు గురైన, అపరిష్కృతంగా ఉన్న భూముల దరఖాస్తులన్నీ పరిష్కారమైనట్లు రికార్డుల్లో చూపడం గమనార్హం. మరో వైపు 767 దరఖాస్తులు కనీసం పరిశీలనకు కూడా నోచుకోలేదు. కాగా, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో ఒక్కసారిగా దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్ పడింది. మరికొన్ని నెలలపాటు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా భూముల సమస్యలపై వచ్చి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు మరోసారి కొన్ని నెలల పాటు అటకెక్కాయి.

పరిష్కారం కాకుండానే..

భూముల సమస్యలు పరిష్కారం కాకపోయినా.. ధరణి ఆన్‌లైన్ రికార్డుల్లో పరిష్కారం చేసినట్లుగా గణాంకాలు వెల్లడవుతున్నాయి. పరిష్కారానికి అవకాశాలున్న భూదస్త్రాలతో పాటు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ పరిధిలోని భూముల దస్త్రాలూ పరిష్కారమైనట్లు ధరణి వెబ్‌సైట్‌లో చూపిస్తుండడంతో రైతులు నివ్వెరబోతున్నారు.

బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌లో ధరణి దరఖాస్తుల వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తులు	2,107
పరిశీలించిన దరఖాస్తులు	1,340
నిర్ధారణకు వచ్చినవి	1,331
తహసీల్దార్ పరిశీలించినవి	307
ఆర్డీవోకు రెఫర్ చేసినవి	393
ఆర్డీవో పరిధిలోని దరఖాస్తులు	82
కలెక్టర్‌కు పంపించినవి	197

జూన్ తర్వాతనే..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం అవకాశాలు లేవు. రాష్ట్రంలో ఎంపీ ఎన్నికల పోలింగ్ మేలో జరిగి జూన్ మొదటి వారంలో ఫలితాలు వెల్లడవుతాయి. అనంతరం జూన్ 6న కేంద్ర ఎన్నికల సంఘం కోడ్ ఎత్తివేయనుంది. కోడ్ ఎత్తివేత అనంతరం మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తేనే అర్ధంతరంగా నిలిచిన ధరణి భూ సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది. అప్పటివరకు బాధిత రైతులు నిరీక్షించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

కార్మికుల రక్షణపై శ్రద్ధ చూపాలి



కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణిలో కార్మికుల రక్షణపై యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ప్రమాదం జరిగిన ఎస్సార్పీ–1 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రమాదంలో కార్మికుడు సత్యనారాయణ రెండు కాళ్లు తెగిపోయి నడవలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యాం, ఏరియా కార్యదర్శులు వెంగళ కుమారస్వామి, రావుల అనిల్, ఎంబడి తిరుపతి, నాయకులు సదయ్య, సతీశ్, వెంకటేశ్, శ్రీనివాస్, తిరుపతిరావు, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ కమాన్ సమీపంలో శుక్రవారం క్రేన్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో కిష్టాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్ ప్రయాణికులను కిష్టాపూర్ నుంచి మండల కేంద్రానికి తీసుకువస్తున్న క్రమంలో కమాన్ సమీపంలో రెబ్బెన బస్టాండ్ వైపు నుంచి వస్తున్న క్రేన్, ఆటో ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న మహేశ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న 108 ఈఎంటీ పరశురాం, పైలట్ తిరుపతి మహేశ్‌ను అంబులెన్స్‌లో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మామిడి రైతులు గట్టెక్కేనా?



చెన్నూర్‌లో పూత, కాత నిలువని మామిడి చెట్టు

- ఈసారి నిలువని పూత, కాత
- దిగుబడిపై రైతుల దిగులు

చెన్నూర్: గత సీజన్‌లో వివిధ రకాల వైరస్‌లు సోకి పంట నష్టపోయిన మామిడి రైతులకు ఈ సీజన్‌లోనూ నష్టాలు తప్పేలా లేవు. ఈ ఏడాది ముందుగా మామిడి పూత రైతులను మురిపించింది. ఆ తర్వాత వాతావరణంలో మార్పుల కారణంగా పిందెలు ఎర్రగా మారి రాలిపోయాయి. జిల్లాలోని భీమారం, జైపూర్, నెన్నెల, వేమనపల్లి, కోటపల్లి, చెన్నూర్, బెల్లంపల్లి మండలాల్లో 8,250 మంది రైతులకు చెందిన 18,170 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. 8,250 మంది మామిడి రైతుల్లో సుమారు 50శాతం మంది తోటలను 2వేల మంది రైతులకు కౌలుకిస్తున్నారు. వీరు పూత సమయంలోనే కౌలు చెల్లించారు. జిల్లాలో పచ్చడి కాయతో పాటు దసరి, బంగినపల్లి, చెరుకు రసం, కొత్తపల్లి కొబ్బరి, హిమాన్‌పసంద్, తోతపరి, పెద్ద రసాలు, గుంట్లీ, లగ్‌డా, పంచదార లాంటి మేలైన రకాలు పండుతుండగా వీటికి ఇతర రాష్ట్రాల్లోనూ డిమాండ్ ఉంది. ఏటా జిల్లా నుంచి వేలాది టన్నుల మామిడి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ఈ సారి పంట ఆశాజనకంగా లేకపోవడంతో ఎగుమతి కష్టమేనని రైతులు చెబుతున్నారు.

నాకు అప్పులే మిగుల్తయ్



చెన్నూర్, కోటపల్లి మండలాల్లో పదెకరాల మామిడి తోటలను రూ.30 లక్షలు అప్పు చేసి కౌలుకు తీసుకున్న. ఈసారి పూత బాగా వచ్చింది. కాత బాగుంటుందని ఆశపడ్డా. వాతావరణంలో వచ్చిన మార్పులతో కాయ ఎర్రబడి రాలింది. 20శాతం కూడా నిలువలేదు. ఏప్రిల్, మేలో గాలిదుమారాలు వస్తే అంతే సంగతి. నాకు అప్పులే మిగుల్తయ్. – నాయిని తిరుపతి, కౌలు రైతు

రైతులను ఆదుకోవాలె



నాకు ఆరెకరాల్లో మామిడి తోట ఉంది. పోయినేడాది మంగు తెగులు సోకి పెట్టిన పెట్టుబడి రాక నష్టాల పాలైన. గతేడాది నష్టాన్ని పూడ్చుకుందామని ఆశపడితే ఈసారి పూత రాలి పిందె నిలువలేదు. మూడేళ్ల క్రితం మామిడి తోటపై రూ.5 లక్షలు సంపాదించిన. రెండేళ్ల నుంచి నష్టాలే మిగులుతున్నయ్. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలె. – జనార్దన్, రైతు, నెన్నెల

బొగ్గు రవాణా మరింత పెంచాలి



సీహెచ్‌పీ వద్ద అధికారులకు సూచనలిస్తున్న డైరెక్టర్

శ్రీరాంపూర్: బొగ్గు రవాణాను మరింత పెంచాలని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు సూచించారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. ముందుగా ఏరియా స్టోర్స్ అనంతరం ఓసీపీ సీహెచ్‌పీ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి ఎంత ముఖ్యమో.. దాన్ని సకాలంలో రవాణా చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. పనిముట్లు ఎప్పుడు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. యంత్రాల విడిభాగాలు కూడా ఎప్పటికప్పుడు సమకూర్చుకోవాలని తెలిపారు. ఓసీపీ వద్ద ఆయన కంట్రోల్‌రూం, సీ 2 కన్వేయర్ బెల్ట్, సెకండరీ సైజర్లను పరిశీలించారు. ఆయన వెంట శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, జనరల్ మేనేజర్ (స్టోర్స్) మాచరయ్య, ఎస్వోటూ డైరెక్టర్ కేవీ రావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, అధికారులు కేశవరావు, యాదయ్య, రవీందర్, చంద్రశేఖర్, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ప్రమాదస్థలిని పరిశీలించిన నాయకులు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఎస్సార్పీ–1 గనిలో ప్రమాదం జరిగిన స్థలాన్ని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం సందర్శించారు. పుల్లీలో పడిన ప్రమాదంలో సత్యనారాయణ అనే హ్యామర్‌మెన్ కార్మికుడికి రెండు కాళ్లు విరిగిపోయాయి. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీ సీతారామయ్య గనిలోకి దిగి ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై పెట్టిన శ్రద్ధ కార్మికుల రక్షణపై పెట్టనందునే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రక్షణ కోసం ఏర్పాటు చేయాల్సిన సేఫ్టీ ట్రైపార్టీయేట్ సమావేశాలను కూడా సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శించారు. ఈ ప్రమాదానికి యాజమాన్యమే బాధ్యత వహించాలని, ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సత్యనారాయణకు పరామర్శ

కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను సీతారామయ్య తదితరులు కలిసి పరామర్శించారు. ఆయనకు అందిస్తున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. సత్యనారాయణకు మనోధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీతారామయ్యతో పాటు యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై ఆందోళన

- ఏసీపీ చొరవతో విరమణ



జరిగిన ఘటనను ఏసీపీకి వివరిస్తున్న బాలికలు

బెల్లంపల్లి: డిప్లొమా ద్వితీయ సంవత్సరం విద్యార్థిని భీముని వైష్ణవి ఆత్మహత్యకు కారకులపై చర్య తీసుకోవాలని శుక్రవారం బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులు ఆందోళనకు దిగారు. విద్యార్థి సంఘాల మద్దతుతో తరగతులు బహిష్కరించి మూడుగంటలపాటు ఆందోళన చేశారు. ఏసీపీ రవికుమార్, సీఐలు దేవయ్య, అఫ్జలుద్దీన్, ఎస్సైలు, సిబ్బందితో వచ్చి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఏసీపీ ఘటన వివరాలు విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, హెచ్‌వోడీ సాంబయ్య, హాస్టల్ మేనేజర్ నాగరాజు, అధ్యాపకులు ఫణికుమార్, మాలతిపై చర్య తీసుకోవాలని విద్యార్థులు నినదించారు. కాగా, భూపాలపల్లి జిల్లా చిట్యాల పోలీసులు స్థానిక పోలీసులకు ఫోన్ చేసి బాలిక మృతి ఘటనపై ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, హాస్టల్ మేనేజర్ మానసికంగా వేధించడంతోనే వైష్ణవి ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. ఈనెల 14న తోటి విద్యార్థిని బర్త్‌డే సందర్భంగా కేక్ కట్ చేయడాన్ని సీరియస్‌గా తీసుకుని వీరు వైష్ణవిని దుర్భాషలాడారని తెలిపారు. మరుసటిరోజు ఆమె తల్లిదండ్రులను పిలిపించి వైష్ణవిని ఇంటికి పంపించారని పేర్కొన్నారు. దీంతో మనస్తాపం చెందిన వైష్ణవి 17న ఇంట్లో గుర్తు తెలియని మందు తాగినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆమెను వరంగల్ ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందని వివరించారు. చదువులో చురుకుగా ఉండే వైష్ణవి ఆత్మహత్య ఘటనను జీర్ణించుకోలేకపోతున్నామని తోటి విద్యార్థినులు విలపించారు. ఆమె మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు ఆదర్శ్, సాగర్, చరణ్, రాజేంద్రప్రసాద్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

వాంకిడి: మండలంలోని ఎల్లానగర్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లానగర్ గ్రామానికి చెందిన ముచ్చనేని సునీత (18) గురువారం మండల కేంద్రంలో నిర్వహించే సంతకు వెళ్లి వచ్చింది. శుక్రవారం తెల్లవారు జామున సునీత ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, గురువారం మహారాష్ట్రలోని సుగునాపురం గ్రామానికి చెందిన మోటి అంకూష్ అనే యువకుడు ఎల్లానగర్‌లోని సునీత ఇంటి ముందు రెండు, మూడుసార్లు చక్కర్లు కొట్టగా ఆమె అక్క సారక్క అతడిని నిలదీసింది. దీంతో అక్కడి నుంచి ఆ యువకుడు వెళ్లి తిరిగి మళ్లీ రాలేదు. కాగా, అంకూష్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ యువతి తల్లి గిర్జుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రెండు వేర్వేరు చోట్ల శుక్రవారం పోలీసులు దాడి చేసి రూ.40 వేల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మందమర్రి సర్కిల్ పీఎస్‌లో శుక్రవారం సీఐ శశిధర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. చెంచు కాలనీకి చెందిన షారూఖ్ సమీపంలోని రైల్వే ట్రాక్ ఏరియాలో గంజాయి తరలిస్తున్నాడనే సమాచారం మేరకు అతడిని పట్టుకోగా 1,100 గ్రాముల గంజాయి లభించింది. అలాగే మారుతీనగర్‌కు చెందిన మక్కల గంగాధర్ అనే యువకుడు చెంచు కాలనీలో గంజాయి అమ్ముతున్నాడనే సమాచారం రాగా దాడి చేసి అతడి నుంచి 500గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడిలో పాల్గొన్న ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని అభినందించారు.

తప్పిపోయిన వ్యక్తి మృతి



రాములు (ఫైల్)

సిర్పూర్(టి): ఈనెల 11న తప్పిపోయిన లారీ క్లీనర్ రంగపురం రాములు (45) ఈనెల 21న మృతిచెంది కనిపించాడు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రాములు ఈనెల 11న తాను పనిచేసే లారీ మండలంలోని పెద్దబండ సమీపంలో చెడిపోగా గ్రామంలోకి వెళ్లి వస్తానని డ్రైవర్‌కు చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో అతడి భార్య చిట్టమ్మ ఫిర్యాదు చేసింది. ఈనెల 21న అచ్చెల్లి సమీప పత్తి చేనులో కుళ్లిన మృతదేహాన్ని గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ పోలీసులకు సమాచారం అందించాడు. వారు పరిశీలించి రాములు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని శుక్రవారం పరిశీలించగా రాములుదేనని అతడి భార్య చిట్టమ్మ గుర్తించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

వాంకిడి: కులం పేరుతో దూషించిన ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గేడం తారాబాయితో అదే గ్రామానికి చెందిన సయ్యద్, అమ్జద్, సాదిక్‌తో వాగ్వాదం జరిగింది. దీంతో వీరు గురువారం తారాబాయి ఇంట్లోకి ప్రవేశించి ఎస్టీ కులానికి చెందిన మహిళవు అంటూ కులం పేరుతో దూషించారు. దీనిపై తారాబాయి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి గాంధీనగర్‌లో శివరాత్రి రాజు ఇంట్లో శుక్రవారం పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వీరి నుంచి రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పేకాడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

చోరీ నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎంసీసీ ఫ్యాక్టరీ నుంచి ఇనుప సామగ్రి చోరీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి ఎంసీసీ ఫ్యాక్టరీలోని ఓ స్టోర్ రూం తాళం పగులగొట్టి ఇనుప సామగ్రి ఎత్తుకెళ్లేందుకు యత్నించగా, ఇన్‌చార్జి విజయ్‌గోపాల్ వారిని బెదిరించాడు. దీంతో వారు తీసుకువచ్చిన ట్రాలీలను వదిలి పారిపోయారు. ఈ మేరకు విజయ్‌గోపాల్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలించారు. శుక్రవారం నిందితులు వదిలిపెట్టిన ట్రాలీలను తీసుకెళ్లేందుకు వస్తున్న క్రమంలో ప్రత్యేక టీం సభ్యులు వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం అంగీకరించారు. దీంతో వారిపై కేసు నమోదు చేశారు. శ్రీరాంపూర్ అరుణక్క నగర్‌కు చెందిన మోతె రమేశ్, చున్నంబట్టి వాడకు చెందిన జనగామ దినేశ్, ఒడ్డెర కాలనీకి చెందిన కుక్క సమ్మయ్యను రిమాండ్ చేశారు. వీరి నుంచి ఒక ఆటో ట్రాలీ, రెండు ఆటోలు, రూ.50 వేల విలువైన ఇనుప వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

గత నెల 8వ తేదీన మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడకు చెందిన మాదంశెట్టి ప్రభాకర్‌పై జాఫర్‌నగర్‌కు చెందిన కిచ్చి అర్జు, రాథోడ్ భవన్ ఇద్దరు దాడికి పాల్పడినట్లు అతడి అల్లుడు పెద్ది భరత్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ప్రత్యేక బృందాలతో గాలించగా, గత నెల 27వ తేదీన కిచ్చి అర్జు అనే ప్రథమ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు రాథోడ్ భవన్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

ఇసుక దందాపై కొరడా

- 300 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక సీజ్
- రెండు లారీలు, జేసీబీ పట్టివేత

రెబ్బెన: మండలంలో కొనసాగుతున్న ఇసుక అక్రమ దందాపై విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. పక్కా సమాచారంతో రీజియన్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఆదేశాల మేరకు గురువారం రాత్రి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద కాపు కాశారు. అదే సమయంలో రెబ్బెన వైపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నారు. లారీలతోపాటు ఇసుక లోడింగ్‌కు ఉపయోగించిన జేసీబీని స్వాధీనం చేసుకుని రెబ్బెన పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం విజిలెన్స్, రెవెన్యూ అధికారులు గొల్లగూడ, పుంజుమేరగూడ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను గుర్తించారు. గొల్లగూడ సమీపంలో రెండు చోట్ల, జాతీయ రహదారి పక్కన ఉన్న ఇటుక బట్టీల వెనుక భాగంలో, పుంజుమేరగూడ బస్టాండ్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వెనుక భాగంలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 300 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గుర్తించి సీజ్ చేశారు. ఈ మేరకు పంచనామా నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. విజిలెన్స్ సీఐలు వరుణ్‌ప్రసాద్, ప్రశాంత్‌రావు, ఎస్సై నారాయణ, ఆర్‌ఐ ప్రేమ్‌కిరణ్, విజిలెన్స్ సిబ్బంది అశోక్, అనిల్, సంపత్ పాల్గొన్నారు.

పాత మంచిర్యాల పరిధిలో 150కి పైగా ఇసుక డంపులు సీజ్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మధురానగర్, పాతమంచిర్యాల పరిధిలో 150కి పైగా ఇసుక కుప్పలను శుక్రవారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. మంచిర్యాల తహసీల్దార్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల ఆర్‌ఐ అజీజ్, మైనింగ్ ఎస్‌ఆర్‌వో రాహుల్.. తహసీల్దార్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా అక్రమంగా తరలించి కుప్పలుగా పోసి ఉన్న ఇసుకను సీజ్ చేసి మైనింగ్ ఏడీ బాలుకు అప్పగించారు. ఇసుకను అక్రమంగా తరలించి నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.